క్లుప్తంగా

సద్గురును కలిసిన జియ్యాని


తానా మహాసభల్లో సద్గురు జగ్గీవాసుదేవ్‌తో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్

గోపాలపట్నం: ఈషా ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సద్గురు జగ్గీ వాసుదేవ్‌ను ఉత్తర అమెరికా తానా మహాసభల్లో డిప్యూటీ మేయర్ జియాని శ్రీధర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తానా మహాసభలు మూడో రోజు కార్యక్రమంలో సద్గురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ ఆయన్ను కలిశారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

గోపాలపట్నం: ప్రశాంతినగర్‌లో రహదారి, కాల్వల అభివృద్ధి పనులకు సోమవారం పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్ కుమార్, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కర రావు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ 92వ వార్డులో సుమారు రూ.11 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. కొన్ని పనులు జరుగుతున్నాయని, మరి కొన్ని టెండర్ దశలో ఉన్నాయని తెలిపారు. ఇక్కడి రహదారి, కాల్వ పనులకు జీవీఎంసీ నిధులు రూ.18లక్షలు వెచ్చిస్తున్నట్లు చెప్పారు.

అరకిలో గంజాయి స్వాధీనం

మల్కాపురం: ఇద్దరు యువకులు ప్యాక్ చేస్తున్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నా రు. వివరాలిలా ఉన్నాయి. యారాడ ఘాట్‌లో తుప్పల మధ్య గుర్తు తెలియని ఇద్దరు యువకులు అరకిలో బరువు గల గంజాయిని పొట్లాలుగా ప్యాక్ చేసేందుకు సోమవారం ఉదయం సిద్ధమయ్యారు. ఆ సమయంలో మల్కాపురం పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. అనుమానాస్పదంగా తుప్పల్లో కనిపించిన యువకుల్ని ప్రశ్నించేందుకు వాహనం దిగి పోలీసులు వెళ్తుండగా గంజాయి విడిచిపెట్టి వారు పరారయ్యారు. దీంతో పోలీసుల గంజాయి స్వాధీనం చేసుకుని, నిందితుల కోసం గాలిస్తున్నారు.

13న కాంట్రాక్ట్ కార్మిక సంఘాల ధర్నా

ఉక్కునగరం: కార్మికులకు ఎస్.ఎం.ఎ, ఎ.ఎస్.ఎం.ఎ, ఐఆర్ చెల్లించాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హెల్త్ కార్డులు ఇవ్వాలని, బోనస్‌ను చెల్లించాలనే డిమాండ్‌తో స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ కార్మిక సంఘాలు ఈ నెల 13న ధర్నా చేపట్టనున్నాయి. ఈ మేరకు ధర్నా పోస్టర్‌ను ఎల్‌ఎంఎం పార్కులో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో నమ్మి రమణ, మంత్రి రవి, బొడ్డు గోవింద, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

'పోర్టు కార్మికులకు కనీస వేతనం రూ.36 వేలు ఇవ్వాలి'

పెదగంట్యాడ: అదానీ గంగవరం పోర్టులో కార్మికులకు కనీస వేతనం రూ.36వేలు ఇవ్వాలని ఏఐటీయూసీ జాతీయ కార్యదర్శి రామకృష్ణ పాండా అన్నారు. గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో పోర్టు వంతెన వద్ద గల స్టీల్‌ప్లాంట్ ఆస్పత్రి వద్ద చేపట్టిన నిరవధిక నిరసన దీక్ష శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. కార్మికుల పోరాటానికి మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ కార్మికులకు వెంటనే జీతాలు పెంచాలని, తొలగించిన వారిని మళ్లీ విధుల్లోకి తీసుకోవాలన్నారు. 29 మంది కార్మికులపై విధించిన ఆంక్షలను ఎత్తి వేయాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ అనుచరుడైన ఆదాని గంగవరం పోర్టు టేకోవర్ చేసుకున్నప్పటి నుంచి కార్మికుల పరిస్థితి మరి అధ్వానంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు, ఐఎన్‌టీయూసీ నాయకుడు మంత్రి రాజశేఖర్, నాయకులు ఆదినారాయణ, కొవిరి అప్పలరాజు, డీవీ రమణ, కసిరెడ్డి సత్యనారాయణ, జె.రామకృష్ణ తదితరులు కార్మికులకు మద్దతు తెలిపారు.

పవన్‌పై భగ్గుమన్న వలంటీర్లు

- తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్
- లేకుంటే పవన్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరిక
- పవన్ దిష్టిబొమ్మ దహనం


పవన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతున్న నాయకులు

మల్కాపురం: వలంటీర్ వ్యవస్థపై జనసేన అధినేత పవన్‌కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వలంటీర్లు భగ్గుమన్నారు. రోడ్డెక్కి నిరసన తెలిపారు. పవన్ దిష్టిబొమ్మను చెప్పులతో కొడుతూ ఆయనకు వ్యతిరేకంగా నినదించారు. తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వలంటీర్లలో దాదాపు 70 శాతం మహిళలే అన్న విషయం తెలియకుండా మహిళల అదృశ్యానికి వలంటీర్లే కారణమని ఆయన పిచ్చి వాగుడు వాగడం సరికాదని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. పవన్ వ్యాఖ్యలను ఖండిస్తూ మల్కాపురం పోలీస్‌స్టేషన్ వద్ద సోమవారం సాయంత్రం మానవహారం చేపట్టి పవన్ దిష్టిబొమ్మ దహనం చేశారు. వలంటీర్లు చేపట్టిన నిరసన కార్యక్రమానికి స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దతు తెలిపారు. పార్టీ మహిళానాయకులు మళ్ల ధనలత, చుక్క వరలక్ష్మి మాట్లాడుతూ పవన్‌కు పిచ్చి పట్టిందని అందుకే ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నాడని విమర్శించారు. రాష్ట్రంలో సుమారు 2.60లక్షల మంది వలంటీర్లు ప్రతి కుటుంబానికి ఉత్తమ సేవలు అందిస్తుంటే వారిని కించపరిచేలా మాట్లాడుతావా అని మండిపడ్డారు. మూడు పెళ్లిళ్లు చేసుకున్న పవన్‌కు ఆడదాని బాధ ఏమి తెలుసునని మండిపడ్డారు. కరోనా సమయంలో,ఉపద్రవాలు వచ్చినప్పుడు ఇదే వలంటీర్ వ్యవస్థ బాధితులకు అందించిన సేవలు మరిచిపోయావా పవన్ అని ప్రశ్నించారు.

ఆ సమయంలో ఎక్కడ దాగున్నారు?

కరోనా సమయంలో తన దత్త తండ్రి చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హైదరాబాద్‌లో దాక్కొని తమ ప్రాణాలకు నష్టం కలగకుండా గాజు గదుల్లో దాగున్నారని దుయ్యబట్టారు. ఆ సమయంలో ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను విమర్శించడంతో పవన్ నీచ బుద్ధి బయటపడిందన్నారు.వలంటీర్లకు తక్షణమే క్షమాపన చెప్పాలని లేకుంటే పవన్ ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు బల్లా లక్ష్మణరావు,గుండపు నాగేశ్వరరావు, కొణతాల సుధ, నాయకులు భోగవల్లి నాగభూషణం, పుర్రె సురేష్‌యాదవ్,గులిగిందల కృష్ణ పాల్గొన్నారు.

ఏకేసీ కాలనీలో..

సింధియా: ఏలూరులో పవన్ కల్యాణ్ వలంటీర్లను కించపరుస్తూ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా 40వ వార్డు కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జీవీఎంసీ 40వ వార్డు ఏకేసీ కాలనీలో రోడ్డుపై బైటాయించి తక్షణమే పవన్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వార్డు వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపట్నం స్టేషన్‌లో ఫిర్యాదు


పవన్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న వలంటీర్లు

గోపాలపట్నం: వలంటీర్లపై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన అనుచిత వ్యాఖ్యలపై జీవీఎంసీ 89, 90, 91, 92 వార్డుల వలంటీర్లు మండిపడ్డారు. పవన్ కల్యాణ్ తక్షణమే క్షమాపణ చెప్పాలని బీఆర్‌టీఎస్ సర్వీస్ రహదారిలో రాకపోకలను అడ్డుకుని నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అనుచిత వ్యాఖ్యలు చేసిన పవన్ కల్యాణ్‌పై చర్యలు తీసుకోవాలని గోపాలపట్నం సీఐ ఈదుల నరసింహారావుకు ఫిర్యాదు చేశారు. ప్రజల డేటాను అసాంఘిక శక్తులకు ఇస్తున్నారనడం ఆయన దిగజారుడు తనానికి నిదర్శనమన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుణిశెట్టి శ్రీనివాసరావు, చుక్క ప్రసాదరెడ్డి, అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, ఆళ్ల పైడిరాజు, నమ్మి శ్రీను, గోపి, సత్యవతి, సత్యనారాయణ, రమణ పాల్గొన్నారు.


గోపాలనపట్నం వద్ద రోడ్డుపై నినాదాలు చేస్తున్న వలంటీర్లు, వైఎస్సార్ సీపీ నేతలు


40వ వార్డులో నిరసన తెలుపుతున్న వలంటీర్లు

సమస్యల పరిష్కారానికే గడపగడపకు..


శ్రీరామ్‌నగర్‌లో మహిళకు ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందిస్తున్న ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయ కర్త ఆడారి ఆనంద్ కుమార్ అన్నారు. జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్ నగర్ ప్రాంతంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ గత ప్రభుత్వం హామీలు ఇచ్చి ఎలా మోసం చేసిందో వివరించారు. పశ్చిమ నియోజకవర్గంలో టీడీపీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే కనీసం కరోనా కష్టకాలంలో కూడా ప్రజలకు కనిపించలేదని విమర్శించారు. ప్రజల కష్టాలు, ఇబ్బందులు తెలుసుకోవడం కోసం జగన్ మోహన్‌రెడ్డి తనను నియోజకవర్గ సమన్వయకర్తగా పంపించారని ఆనంద్‌కుమార్ వివరించారు. 2024 ఎన్నికల్లో పశ్చిమ నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిని ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. నియోజకవర్గ ప్రజల సమస్య లు తెలుసుకోవడానికి మీతో మీ ఆనంద్ యాప్ రూపొందించామని వెల్లడించారు. వైఎస్సార్ ప్రభుత్వం వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించారు. జీవీఎంసీ కోఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కర రావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో 91వ వార్డు అధ్యక్షు డు గుణిశెట్టి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌చార్జి గేదెల మురళీకృష్ణ, గోపి, ఊటపల్లి గోవిందు, బండారు నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు వలంటీర్లు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా


హెచ్‌పీసీఎల్ హెచ్‌ఆర్ అధికారులతో మాట్లాడుతున్న భోగవల్లి నాగభూషణం

మల్కాపురం: బ్రిడ్జి అండ్ ట్రూఫ్ సంస్థలో పని చేస్తున్న కార్మికుల బకాయి వేతనాలు తక్షణ చెల్లించాలని, కనీస సౌకర్యాలు కల్పించాలని ఇంటక్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు మంత్రి రాజశేఖర్,భోగవల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. కార్మికులకు వేతనాలు తక్షణమే చెల్లించాలని ఇంటక్ నాయకుల ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ లేబర్ గేటు నుంచి ఆఫీస ర్స్ గేటు వరకు సోమవారం నిరసన ర్యాలీ చేపట్టా రు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడు తూ హెచ్‌పీసీఎల్ (విశాఖ రిఫైనరీ) విస్తరణ పనులను బ్రిడ్జి అండ్ ట్రూఫ్ ఇండియా లిమిటెడ్ చేపడుతుందన్నారు. ఆ సంస్థలో సుమారు 300 మంది కార్మికుల వరకు వివిధ ట్రేడులలో పని చేస్తున్నారని వివరించారు. కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. హెచ్‌పీసీఎల్ ఆఫీసర్స్ గేటు కార్మికులతో నిరసన చేపడుతున్న సమయంలో హెచ్‌పీసీఎల్ డీజీఎం ప్రభాకర్,హెచ్‌ఆర్ మేనేజర్ కాళీ, జాన్‌వెరస్ తదితరులు అక్కడకు వచ్చి మంత్రి రాజశేఖర్,భోగవల్లితో చర్చలు జరిపారు. కార్మికుల కు న్యాయం జరిగే విధంగా తాము చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ నెల 14వ తేదీన మే,జూన్ నెలల వేతనాలు కార్మికులకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వ దంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు తాతబాబు, నర్సింగ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిఫ్ట్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ విజయం


సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన ఐఎన్‌టీయూసీ డైరెక్టర్లు

సింధియా: హిందూస్థాన్ షిప్‌యార్డ్ వర్కర్స్ కో ఆపరేటివ్ త్రిఫ్ట్–క్రెడిట్ సొసైటీ ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అభ్యర్థులు విజయఢంకా మోగించారు. దీంతో ఐఎన్‌టీయూ నాయకులు సోమవారం పరిశ్రమ ఆవరణలో పెద్ద ఎత్తున సంబరాలు చేసుకున్నారు. సోమ వారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించారు. మొత్తం సొసైటీ సభ్యులు 294 మంది ఉండగా, 289 ఓట్లు పోలయ్యాయి. సొసైటీని 9 జోన్లుగా విభజించిన అధికా రులు ప్రతి జోన్‌లోనూ సొసైటీలో ఉన్న 294 మంది పాల్గొనెలా చర్యలు తీసుకున్నారు. 9 జోన్లకు పోటీ పడిన ఐఎన్‌టీయూసీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో గెలుపొందారు. సొసైటీపై ఉన్న అవగాహన, కార్మికుల పక్షాన చేసిన పోరాటాలే గెలిపించాయని ఐఎన్‌టీయూసీ నాయకులు చెప్పారు.

స్వచ్ఛతలో టార్గెట్ నంబర్-1

జెడ్సీ మల్లయ్యనాయుడు


ఇందిరానగర్‌లో అవగాహన కల్పిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

గోపాలపట్నం: స్వచ్ఛ సర్వేక్షణ్‌లో విశాఖను మొదటి స్థానంలో నిలపాలని జోన్-8 జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 92వ వార్డు ఇందిరానగర్‌లో సోమవారం స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిటిజన్ ఫీడ్‌బ్యాక్ తీసుకోవాలని సూచించారు. ప్రతీ వలంటీర్ ఆయా ప్రాంతాల ప్రజలతో ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించి ఫీడ్ బ్యాక్ చేయించాలన్నారు. విశాఖనగరాన్ని మొదటి స్థానంలో నిలబెట్టడానికి అంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ప్రజల కూడా సహకరించి నగరానికి మొదటి ర్యాంకు సాధనలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎస్ రమణ, శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార నిర్మాణం తొలగింపు

మల్కాపురం: జీవీఎంసీ 59వ వార్డు నెహ్రూనగర్ సచివాలయం సమీపంలోని గెడ్డను ఆక్రమించి చేపడుతున్న ఇంటి నిర్మాణంపై 'గెడ్డను ఆక్రమించిన ఘనుడు' అనే శీర్షికన సోమవారం సాక్షిలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. దీనిపై స్పందించిన రెవెన్యూ అధికారులు సోమవారం మధ్యాహ్నం అక్రమ నిర్మాణం వద్దకు శ్లాబ్‌ను కూల్చారు. దీంతో స్థానిక కాలనీ వాసులు మీడియా ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛత పఖ్వాడ్ ప్రచార రథం ప్రారంభం


కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ అధికారులతో కమిషనర్ సాయికాంత్ వర్మ

మల్కాపురం: హెచ్‌పీసీఎల్(విశాఖ రిఫైనరీ) సంస్థ సౌజన్యంతో నగరంలోని 8 జోన్ల పరిధిలో పర్యటించనున్న స్వచ్ఛత పఖ్వాడ్ ప్రచార రథాన్ని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్‌వర్మ సోమవారం ఉదయం ప్రారంభించారు. హెచ్‌పీసీఎల్ ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రచార రథాలు స్వచ్ఛతపై అవగాహన కల్పిస్తాయన్నారు. నగర పరిశుభ్రతకు హెచ్‌పీసీఎల్ సంస్థ అందిస్తున్న సహకారం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు స్వచ్ఛతపై వీధి నాటకం ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌పీసీఎల్ పలు విభాగాల అధికారులు, జీవీఎంసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష అందరికీ రక్ష


కుల ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆడారి ఆనంద్‌కుమార్


కార్యక్రమంలో పాల్గొన్న వివిధ దరఖాస్తుదారులు

పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్

మల్కాపురం: గత ప్రభుత్వ పాలనలో ఆదాయ,కుల, నివాస, ఫ్యామిలీ సర్టిఫికెట్, రేషన్‌కార్డు ఇలా ఏ సేవలు కావాలన్నా దరఖాస్తు దారులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగేవారు.. బ్రోకర్లకు డబ్బులు చెల్లించుకోవాల్సి వచ్చేది.. నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చి ప్రజల ముంగిటకే సేవలందిస్తున్నారు.. తాజాగా మరో అడుగు ముందుకు వేసి ప్రజలకు కావాల్సిన 11 రకాల ధ్రువపత్రాలు ఉచితంగా ఇవ్వడానికి అధికారులనే ఇంటికి పంపించి దేశ చరిత్రలో రికార్డు సృష్టించారని వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరాకాలనీలో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతీ కుటుంబం సంతోషంగా ఉండాలని సీఎం వైఎస్ జగన్ కోరుకుంటున్నారన్నారు. దీనిలో భాగంగా వారికి అవసరమై న సేవలు ఇంటి వద్దే అందించేందుకు సురక్ష కార్య క్రమానికి నాంది పలికారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఇలాంటి సేవలు ఆయా రాష్ట్రాల ప్రజలకు అందుతున్నాయా అని ప్రశ్నించారు. గత టీడీపీ ప్రభుత్వ పాలనకు,జగనన్న పాలనకు తేడా ను జనం గమనించాలని కోరారు. ఒక్క పైసా ఖర్చు లేకుండా సేవలు అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి మన రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం మన అందరి అదృష్టమన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పలు ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారికి పత్రాలు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ములగాడ తహసీల్దార్ వీరభద్రరావు,వార్డు కార్పొరేటర్ పి.వి.సురేష్, కనక మహాలక్ష్మి దేవస్థానం ట్రస్టు బోర్డు మెంబర్ మళ్ల ధనలత,ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు కలిదిండి బద్రీనాథ్,నాయకులు నరేష్,అంగ రాంప్రసాద్,శనగడం పత్నిరావు పాల్గొన్నారు.

చాలా సంతోషంగా ఉంది



గతంలో ఆదాయ సర్టిఫికెట్ కావాలంటే తహసీల్దార్ కార్యాలయం చుట్టూ రోజుల తరబడి తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు మా పిల్లలకు అవసరమైన కుల,నివాస,ఆదాయ సర్టిఫికెట్ల దరఖాస్తులు వలంటీర్ ఇంటి వద్ద స్వీకరించి ఒకే సారి అందించారు. చాలా సంతోషంగా ఉంది. ఇలాంటి సేవలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తాము రుణపడి ఉంటాం.

కె.నాగమణి, ఇందిరాకాలనీ

గురుకుల పాఠశాల సందర్శన


గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కాంతారావు


అధ్వానంగా బాత్‌రూములు

గోపాలపట్నం: జీవీఎంసీ 92వ వార్డు మేహాద్రి గెడ్డ సమీప డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను సోమవారం ఏపీ ఫుడ్ కార్పొరేషన్ సభ్యుడు బి.కాంతారావు సందర్శించారు. పలువురు విద్యార్థుల నుంచి అందిన ఫిర్యాదు మేరకు ఆయన పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో మాట్లాడారు. హాస్టల్ గదులను పరిశీలించారు. అధ్వానంగా ఉండడాన్ని చూసి అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా బడుగు బలహీన వర్గాల కోసం నిర్వహిస్తున్న గురుకుల పాఠశాల పరిసరాలు అధ్వానం ఉండడం దారుణమన్నారు. తరగతి, హాస్టల్ గదులను విద్యార్థులే శుభ్రం చేసుకోవడం తగదన్నారు. పాఠశాల అధ్వాన పరిస్థితులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని, సౌకర్యాలు మెరుగుపరిచేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు.

జీఎస్‌టీపై పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాద రెడ్డి

ఏయూ క్యాంపస్: సేవల పన్ను(జీఎస్‌టీ)పై రచించిన ద్విభాషా పుస్తకాన్ని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి సోమవారం తన కార్యాలయంలో ఆవిష్కరించారు. బీకాం ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఉపయుక్తంగా ఏయూ అకడమిక్ డీన్ ఆచార్య ఎస్.కిషోర్‌బాబు ఎడిటర్‌గా, డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల అధ్యాపకులు డాక్టర్ గుడిపాటి శ్రీనివాసరావు, డాక్టర్ జి.అరుణ్‌కుమార్, డాక్టర్ కె.శ్రీనివాసరావు, డాక్టర్ ఎం.శ్యాంబాబు, హెచ్.ఎస్.ఎన్.వి.ఎస్.పవన్‌కుమార్ సహ రచయితలుగా ఈ పుస్తకాన్ని తీర్చిదిద్దారు. విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో ఆంగ్లం, తెలుగు భాష్లో ఈ పుస్తకాన్ని తీసుకొచ్చినట్టు రచయితలు తెలిపారు. సులభంగా వస్తు, సేవల పన్నులకు సంబంధించిన పాఠ్యాంశాలను దీనిలో పొందుపరిచామన్నారు. ఈ సందర్భంగా పుస్తక రచయితలను వీసీ ప్రసాదరెడ్డి అభినందించారు.

యోగాతో శరీరం, మనస్సు అనుసంధానం


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: మానవ శరీరం, మనస్సులను అనుసంధానం చేసేదిగా యోగా నిలుస్తుందని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ యోగా విలేజ్‌లో జరుగుతున్న 'అనుష్టాన యోగ వేదాంత ఫర్ హోలిస్టిక్ లివింగ్'రెండు రోజుల సదస్సు ముగింపు కార్యక్రమం సోమవారం జరిగింది. యోగాచార్య డాక్టర్ రాపర్తి రామారావు శత జయంతి ఉత్సవాలలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ భారతీయ మూలాలు కలిగిన యోగా నేడు విశ్వవ్యాప్తంగా విస్తరించిందన్నారు. సాత్విక లక్షణాలను పెంపొదించే ఆహారాన్ని స్వీకరించడం ఎంతో ప్రధానమన్నారు. యోగా కాన్షియస్‌నెస్ ట్రస్ట్ వ్యవస్థాపక ట్రస్టీ ఆచార్య పి.రవీంద్రనాథ్, ఆర్‌వీఆర్ ప్రాజెక్ట్స్ చైర్మన్ ఆర్.వెంకటేశ్వరరావు, యోగా విభాగాధిపతి ఆచార్య కె.రమేష్‌బాబు, డాక్టర్ ఆర్.తులసిరావు, డి.వెంకటరావు, డి.సాయి కృష్ణ, డాక్టర్ సునీత, నాగిరెడ్డి, డాక్టర్ సి.శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వం దిగిరాక తప్పదు'


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకుడు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట కార్మికులు తమ జీవితాల కోసం చేస్తున్న పోరాటానికి కేంద్రప్రభుత్వం దిగి రాక తప్పదని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ అంశంలో నిర్ణయం మార్చుకోవాల్సిందేనని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 879వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలో పలువురు కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను కార్మికులంతా ఐక్యంగా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.